సాక్షి
జగిత్యాల

ఆదివారం । 10 । ఆగస్టు । 2025



అంజన్న గిరి ప్రదక్షిణలో భక్తులు

మల్యాల: కొండగట్టు అంజన్న సన్నిధిలో శనివారం వందలాదిమంది భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. భక్తుల జై శ్రీరాం.. జై హనుమాన్ నినాదాలతో పరిసరాలు మారుమోగాయి.



కిక్కిరిసిన కొండగట్టు

మల్యాల: అంజన్న ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచే స్వామిని దర్శించుకున్నారు. భక్తుల ద్వారా రూ. 2.80లక్షల ఆదాయం సమకూరింది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0/22.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు, మరికొన్ని చోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

నృసింహస్వామి సన్నిధిలో మంత్రి అడ్లూరి



లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి

గొల్లపల్లి: రాఖీపౌర్ణమి సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్నారు.

భక్తజన సంద్రంగా గోదావరి



ధర్మపురి గోదావరిలో పోటెత్తిన భక్తులు

ధర్మపురి: శ్రావణ శనివారం, పౌర్ణమి సందర్భంగా ధర్మపురి గోదావరి భక్త జనసంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయాల్లో మొక్కులు చెల్లించుకున్నారు.

కథలాపూర్ చేరిన వరదకాలువ నీరు



వరదకాలువలో పారుతున్న నీరు

కథలాపూర్: ఎస్సారెస్పీ నుంచి ఈనెల 7న వరదకాలువకు నీరు వదలగా.. శనివారం మండలంలోని గ్రామాలకు చేరాయి. వరదకాలువలో నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందారు. ఆలస్యంగానైనా నీటి విడుదలతో రైతుల్లో ఆశలు చిగురించాయి. పెగ్గెర్ల, కథలాపూర్, దుంపేట, దూలూర్, తక్కళ్లపెల్లి గ్రామాల మీదుగా నీరు ప్రవహించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు జీవన్‌రెడ్డి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న మాజీమంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మాజీమంత్రి జీవన్‌రెడ్డి భూమిపూజ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో రాజకీయాలకు అతీతంగా అర్హత ప్రతిపాదికన మంజూరు చేస్తున్నారని తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు జున్ను రాజేందర్, నాయకులు పెద్దన్న, సురేశ్, శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి



చిత్రవేణిగూడెంలో కొమురంభీంకు నివాళి అర్పిస్తున్న ఆదివాసీలు

సారంగాపూర్: ఆదివాసీ దినోత్సవాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు చిక్రం మారుతి అన్నారు. శనివారం బీర్‌పూర్ మండలం చిత్రవేణిగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వాలు మరిన్ని నిధులు కేటాయించాలన్నారు. ఆదివాసీలు నివాసం ఉండే చోట విద్యా, వైద్యం, వసతులు కల్పించాలని పేర్కొన్నారు. పోడు వ్యవసాయం ఆదివాసీల హక్కు అని, అలాంటి భూములకు పట్టాలు ఇచ్చి హక్కులు కల్పించాలని కోరారు. జిల్లాలో 10 వేల మంది వరకు ఆదివాసీలు ఉన్నారని, ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ముందుగా ఆదివాసీల ఆరాధ్యుడు కొమురంభీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సంప్రదాయ నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, ఆదివాసీ నాయకులు కుడిమెత గంగారాం, చిక్రం హరీశ్, లక్ష్మణ్, భగవంత్‌రావు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాఖీ వేడుక



ధర్మపురిలో రాఖీ వేడుకల్లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కు రాఖీ కడుతున్న ఆయన సోదరి సమత



ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు రాఖీ కడుతున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జ్యోతి



మాజీమంత్రి జీవన్‌రెడ్డికి రాఖీ కడుతున్న మాజీ కౌన్సిలర్ అనిత

జగిత్యాల/కోరుట్ల/గొల్లపల్లి: రాఖీ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి అడ్లూరికి పలువురు రాఖీ కట్టారు. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కి ఆయన సోదరి డాక్టర్ సమత రాఖీ కట్టారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, జీవన్‌రెడ్డికి మాజీ కౌన్సిలర్ అనిత రాఖీ కట్టారు.

మిగిలింది ఐదు రోజులే..!

- 'భూభారతి' సమస్యలు పరిష్కారమయ్యేనా..?
- ఈనెల 15వ తేదీ గడువు
- ఒకవైపు సిబ్బంది కొరత
- మరోవైపు సమస్యలపై స్పష్టత కరువు
- జిల్లాలో మొత్తం దరఖాస్తులు 24,420



జగిత్యాల: 'ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని తీసుకొచ్చాం. ఆయా సమస్యలపై రెవెన్యూ సదస్సులు నిర్వహించి.. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఆగస్టు 15 వరకు దరఖాస్తులన్నింటినీ పరిష్కరించాలి..' ఇది కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులకు జారీ చేసిన ఆదేశం. కానీ.. ఆయన ఆదేశాలు క్షేత్రస్థాయిలో గడువులోపు అమలయ్యే అవకాశం కన్పించడం లేదు. ఆయన ఇచ్చిన గడువుకు ఇంకా మిగిలింది ఐదు రోజులు మాత్రమే. ఆ లోపు సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం కన్పించడం లేదు. జిల్లావ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 24,420 దరఖాస్తులు వచ్చాయి. అందులో 24,387 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. 21,591 మందికి నోటీసులు జారీ చేశారు. ఇందులో కేవలం 910 మాత్రమే పరిష్కారం అయ్యాయి. 434 దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. ఈ ఆగస్టు 15లోపు సమస్యలన్నిటినీ పరిష్కరించాలని ప్రభుత్వం స్పష్టంగా ఆదేశాలు జారీ చేసినా కొన్ని ఇబ్బందులతో అధికారులు కూడా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ కింద బుగ్గారం మండలాన్ని ఎన్నుకుని అందులో దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించారు. జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో అత్యధికంగా మిస్సింగ్ సర్వేనంబర్లు రాగా, సాదాబైనామాలే 8,667 వచ్చాయి. మిస్సింగ్ సర్వేనంబర్లు 4,237 వచ్చాయి. వచ్చిన దరఖాస్తులన్నింటిని అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు గానీ.. సమస్య పరిష్కరించాలంటే కొన్ని సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. జిల్లాలో అత్యధికంగా సాదాబైనామాలపైనే దరఖాస్తులు వచ్చాయి. గత ప్రభుత్వం 2జూన్ 2014కు ముందు సాదాబైనామాల ద్వారా భూములు కొనుగోలు చేసిన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంది. కొన్నాళ్లకు సాదాబైనామాల గురించి పెద్దగా పట్టించుకోలేదు. ప్రస్తుతం అలాంటి వాటిపై స్పష్టత లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి సాదాబైనామా దరఖాస్తులు పరిశీలించి క్రమద్దీకరించాలని రైతులు కోరుతున్నారు.

గడువులోపు కష్టమే..

జిల్లావ్యాప్తంగా వచ్చిన దరఖాస్తుల్లో కేవలం 910 మాత్రమే పరిష్కరించారు. ఇంకా 23,510 పెండింగ్‌లో ఉన్నాయి. సమయం ఐదు రోజులే ఉండటంతో పూర్తిస్థాయిలో పరిష్కారం అయ్యే అవకాశాలు కన్పించడం లేదు. వచ్చిన దరఖాస్తులను ఆయా సమస్యలను బట్టి తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ నోటీసులు ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటి వరకు చిన్నచిన్న సమస్యలకు సంబంధించి అప్‌డేట్ చేశారే కానీ పెద్ద సమస్యలన్నీ అలాగే ఉన్నాయి. కొన్ని కోర్టుల్లో సైతం పెండింగ్‌లో ఉండటంతో వాటిని పరిష్కరించాలన్నా కొన్ని టెక్నికల్ సమస్యలు వస్తున్నాయి.

పరిష్కరించే దిశగా చర్యలు



భూభారతిలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. దాదాపు గడువులోపు పూర్తి చేసేలా చూస్తాం. ఆన్‌లైన్‌లో అన్ని దరఖాస్తులు దాదాపుగా పూర్తయ్యాయి. ప్రతి సమస్యకు నోటీసులు జారీ చేశాం. రైతుల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం.

– సత్యప్రసాద్, కలెక్టర్

రైతుల్లో ఆశలు

గతంలో ధరణి పోర్టల్ కొన్ని తప్పిదాలు ఉండటంతో రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయారు. ఎక్కువ శాతం సర్వేనంబర్లు మిస్సింగ్ కావడం, ఒకరి సర్వేనంబర్లు మరొక రైతులకు రావడంతో ఇబ్బందులకు గురయ్యారు. దీంతో భూభారతి చట్టాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకురావడంతో రైతుల్లో కొంత ఆశలు రేకెత్తాయి. చిన్న చిన్న సమస్యలు అనేకంగా పరిష్కారమ్యాయి. పూర్తిస్థాయిలో పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

రీచ్ వద్దంటూనే ఇసుక తవ్వకాలు..

మెట్‌పల్లిలో విధులు నిర్వర్తిస్తున్న ఓ ప్రభుత్వ అధికారి తన ఇంటి నిర్మాణ పనులకు ఇసుక కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. డీడీ తీసి కార్యాలయంలో అందించారు. ఆత్మకూర్ రీచ్ నుంచి ఇసుక తీసుకెళ్లేందుకు అధికారులు అనుమతి ఇచ్చారు. దీంతో ఇసుక కోసం ట్రాక్టర్లు వాగుకు వెళ్లగా కొందరు అడ్డుకున్నారు. అధికారులు హెచ్చరించినప్పటికీ వినకుండా రాద్ధాంతం చేశారు. చివరకు పోలీసుల దృష్టికి వెళ్లడంతో ట్రాక్టర్లను అక్కడి నుంచి పంపించారు. ఇలా అనుమతి తీసుకున్న వారు ఇసుక తీసుకెళ్లేందుకు ఇబ్బంది పడుతుండగా.. అనుమతి లేకుండా ఇసుక యథేచ్ఛగా తరలిపోతోంది.

- ఆత్మకూర్ పెద్దవాగు ఇసుక రవాణాపై విమర్శలు
- రీచ్ నుంచి అనుమతి లేకుండానే తరలింపు
- ఇందిరమ్మ ఇళ్ల ఇసుకకూ డబ్బులు వసూలు
- తాజాగా 'సూరమ్మ' పనులకు అనుమతులపై అభ్యంతరం



ఆత్మకూర్ పెద్దవాగు నుంచి ఇసుకతీత

మెట్‌పల్లి రూరల్: 'వాగులో ఇసుక తవ్వకాలతో భూగర్భజలాలు ఇంకిపోతాయి.. నీటి విషయంలో ఇబ్బందులు ఎదురవుతాయి.. తమ గ్రామ శివారులోని పెద్దవాగు నుంచి ఇసుక తవ్వకాలు చేపట్టవద్దు.. రీచ్‌గా గుర్తించినట్లు జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలి..' ఇది మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ వీడీసీ, గ్రామస్తులు పదేపదే ఇసుక విషయంలో వాదిస్తున్న తీరు. రీచ్‌ను రద్దు చేసేలా అధికారులపై ఒత్తిడి తీసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నేతలను కలుస్తున్న వైనం. గతేడాది నవంబర్‌లో రీచ్ ప్రారంభమైనప్పటి నుంచి అభ్యంతరాలు తెలుపుతున్న గ్రామస్తులు.. అదే పెద్దవాగు నుంచి నాలుగైదు రోజుల క్రితం వరకు అనుమతి లేకుండా పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలు చేపట్టడం గమనార్హం. వాగునుంచి వందల ట్రాక్టర్ల ఇసుక తరలిపోవడం..అందుకు అనధికారికంగా డబ్బులు వసూలు చేయడం చర్చనీయాంశంగా మారింది. రీచ్ రద్దు చేయాలంటూనే..అనుమతి లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గతేడాది రీచ్ పాయింట్

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో పాటు ప్రజల అవసరాలు తీర్చేందుకు ఆత్మకూర్ పెద్దవాగును ప్రభుత్వం 2024 నవంబర్ రీచ్ పాయింట్‌గా ఏర్పాటు చేసింది. మైనింగ్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించారు. ఈ ప్రాంతంలో సుమారు 5,550 టన్నుల ఇసుక తీసేవీలుందని గుర్తించారు. అప్పటినుంచి రీచ్ పాయింట్ ఏర్పాటుపై వివాదం కొనసాగుతోంది. వాగు నుంచి ఇసుక తవ్వకాలు చేపడితే భూగర్భజలాలు పడిపోతాయని, రీచ్ రద్దు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. మధ్యలో కొందరు డీడీలు చెల్లించి ఇసుక తీసుకెళ్లేందుకు వెళ్తే అడ్డుకుంటున్నారు. సీసీ రోడ్లు, ఇతరత్రా పనులకు అనుమతి ఉన్నా.. అడ్డంకులు సృష్టించిన గ్రామస్తులు.. అధికారులు ఒత్తిడి చేస్తేనే సరేనంటున్న పరిస్థితి. తాజాగా కథలాపూర్ మండలం కలిగోట సూరమ్మ ప్రాజెక్ట్ నిర్మాణ పనులకు ఇసుక అనుమతి ఇవ్వడంతో మరోమారు రీచ్‌ను రద్దు చేయాలనే అంశాన్ని గ్రామస్తులు తెరపైకి తెచ్చారు. భూగర్భజలాలు పడిపోతాయని పదేపదే చెబుతున్న గ్రామస్తులు..



ఇందిరమ్మ ఇంటి ఇసుకకు డబ్బులు తీసుకుని ఇచ్చిన రశీదు

ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిపోతున్నా ఎందుకు అడ్డుకట్ట వేయడం లేదన్నది ప్రశ్నగా మారింది. వందలాది ట్రాక్టర్ల ఇసుక అనుమతులు లేకుండా తరలిపోయినప్పుడు మిన్నుకుండిపోయిన గ్రామస్తులు.. ప్రభుత్వ పనులకు అనుమతి ఇచ్చాకే గ్రామస్తులు ఆందోళన చేయడంపై అధికారులు కూడా విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాక్టర్‌కు రూ.1000 వసూలు

పెద్దవాగు రీచ్ పాయింట్ నుంచి అనుమతి లేకుండా బుధవారం వరకు ఇసుక తవ్వకాలు జరిగాయి. కొందరు వ్యక్తులు ట్రాక్టర్‌కు రూ.వెయ్యి వసూలు చేసినట్లు సమాచారం. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఉచితంగా ఇసుక సరఫరా చేస్తుండగా.. వాటికీ డబ్బులు వసూలు చేయడం గమనార్హం. కొందరు తహసీల్దార్‌కు ఫోన్ ద్వారా తెలిపినా వినకుండా రూ.500 చొప్పున వసూలు చేసినట్లు తెలిసింది.

కేసులు నమోదు చేస్తాం

ఆత్మకూర్ పెద్దవాగు నుంచి ఇసుక తీసిన విషయంపై వీడీసీ సభ్యులను పిలిపించాం. అనుమతి లేకుండా ఇసుక తీయొద్దని హెచ్చరించాం. ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక కోసం వెళ్తే డబ్బులు వసూలు చేసినట్లు మా దృష్టికి వచ్చింది. ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దు. అక్రమ ఇసుక రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తాం.

– నీత, తహసీల్దార్,మెట్‌పల్లి

యువజన సంఘాల ఊసేది

- ఏడాదిన్నరగా నిలిచిన నెహ్రూ యువ కేంద్రం వలంటీర్ల నియామకం
- కొత్త జిల్లా ప్రకారం వలంటీర్లను నియమించాలంటున్న యువత

కథలాపూర్: నెహ్రూ యువ కేంద్రంలో వాలంటీర్ల వ్యవస్థ నిలిచిపోయింది. ఏడాదిన్నర నుంచి పోస్టులు భర్తీ చేయడంలేదు. దేశప్రగతిలో యువతను భాగస్వామ్యం చేసేందుకు కేంద్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నెహ్రూ యువ కేంద్రం పేరును ఇటీవల 'మేరా యువ భారత్'గా మార్చారు. యువజన సంఘాల ను పర్యవేక్షిస్తూ వారిలో చైతన్యం నింపేందుకు క్షేత్రస్థాయిలో వాలంటీర్ల వ్యవస్థ పని చేయాల్సి ఉంటుంది. ఏడాదిన్నరగా జిల్లాలో కొత్తగా యువజన సంఘాల స్థాపన ఊసేలేదు. సమాజంలోని రుగ్మతలను రూపుమాపేలా ప్రజా చైతన్య కార్యక్రమాలు స్తంభించిపోయాయని పేర్కొంటున్నారు.

ఎన్‌వైకే వాలంటీర్లుంటే ప్రజా చైతన్య కార్యక్రమాలు

ప్రస్తుత పరిస్థితుల్లో గంజాయి, మత్తు పదార్థాలు యువతపై చెడు ప్రభావం చూపుతోంది. యువతలో మార్పు తేవడానికి ఎన్‌వైకే వలంటీర్ల కార్యక్రమాలు ప్రభావం చూపుతాయి. వలంటీర్ల నియామకాల్లో 18 ఏళ్ల నుంచి 29 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలి. ఉన్నత విద్య, కంప్యూటర్ పరిజ్ఞానం, స్మార్ట్ ఫోన్ ఆపరేటింగ్ తెలిసి ఉండి ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్‌లో పనిచేసినవారికి ప్రాధాన్యం ఇస్తారు. గ్రామాల్లో సర్పంచుల, పట్టణాల్లో కౌన్సిలర్ల పాలన కొనసాగడంలేదు. ఇలాంటి సందర్భాల్లో యువ కేంద్రాల వలంటీర్లుంటే ప్రజల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తే ప్రయోజనముంటుందని అంటున్నారు. రక్తదాన శిబిరాలు, వన మహోత్సవం, స్వచ్ఛ భారత్, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, మూఢనమ్మకాల నిర్మూలన, బాల్య వివాహాలు అరికట్టడం, క్రీడలు తదితర సామాజిక కార్యక్రమాలు యువజన సంఘాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో వలంటీర్లు కీలకంగా వ్యవహరిస్తారు. వలంటీర్ వ్యవస్థ ఉద్యోగం కానప్పటికి సేవా భావంతో పని చేస్తుండటంతో గౌరవ వేతనం రూ.5 వేలు చెల్లిస్తారు.



సేవ కార్యక్రమాల్లో భాగంగా కాలువల్లో దోమల నివారణ మందు చల్లుతున్న యువత (ఫైల్)

కొత్త జిల్లాల వారీగా నియమిస్తే ప్రయోజనం

నెహ్రూ యువ కేంద్రం వలంటీర్ల నియామకం గురించి ఏడాదిన్నరగా పట్టించుకోవడంలేదని యువత అంటోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంగా ఎన్‌వైకేను కొనసాగిస్తుండటంతో జిల్లాకు కేవలం ముగ్గురు వలంటీర్లను మాత్రమే నియమించి అరకొరగా కార్యక్రమాలు నిర్వహించేవారు. జిల్లా ఏర్పడి తొమ్మిదేళ్లు అవుతోంది. ప్రస్తుతం 20 మండలాలున్నాయి. రోజురోజుకూ జనాభా పెరుగుతుండటంతో కొత్త జిల్లాల ప్రకారం ఎన్‌వైకే కార్యక్రమాలు నిర్వహిస్తే రెండు మండలాలను కలిపి ఒక బ్లాక్‌గా ఏర్పాటు చేసి సుమారు 10 మంది వలంటీర్లను నియమించే అవకాశం ఉంటుందని యువజన సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఇలా అయితేనే లక్ష్యం నెరవేరుతుందంటున్నారు. యువజనశాఖ ఉన్నతాధికారులు చొరవ చూపి కొత్త జిల్లాల ప్రకారం ఎన్‌వైకే వలంటీర్లను నియమించి ప్రజాచైతన్య కార్యక్రమాలు కొనసాగించాలని యువత కోరుతోంది.

ప్రజా చైతన్య కార్యక్రమాలతో మార్పు



గ్రామాలు, పట్టణాల్లో మత్తు పదార్థాలతో యువత చెడుమార్గంలో వెళ్తోంది. మూఢ నమ్మకాల ప్రభావంతో ప్రజలు ఆర్థికంగా చితికిపోతున్నారు. కొత్తరకం సైబర్ మోసాలు జరుగుతుండటంతో ఆర్థిక పరిస్థితులు పడిపోతున్నాయి. ప్రజల్లో చైతన్యం తేవాలి. వలంటీర్లను త్వరగా నియమిస్తే మోసాలు అరికట్టవచ్చు.

– సీహెచ్ రాజుకుమార్, యువకుడు, బొమ్మెన

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..

ప్రస్తుతం ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోనే జిల్లా నెహ్రూ యువ కేంద్రం నిర్వహిస్తున్నాం. జిల్లాకు గతంలో ముగ్గురు వాలంటీర్లు ఉండేవారు. వారితోనే ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాం. ఏడాదిన్నరగా వాలంటీర్ల నియామకం జరగలేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వలంటీర్లను నియమిస్తాం.

– రాంబాబు, యువజన శాఖ అధికారి

అన్నదానం టోకెన్లు ఎప్పుడో.. ఎక్కడో..!

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు అన్నదాన ప్రసాదం కొందరికే అందుతోంది. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం ఆలయ ఆవరణలో నిత్యాన్నదాన సత్రం నిర్వహిస్తున్నారు. ప్రతి మంగళ, శనివారాల్లో 200 మంది భక్తులకు.. మిగిలిన రోజుల్లో రోజుకు వందిమంది చొప్పున భక్తులకు అన్నదానం అందిస్తున్నారు. అన్నదానం టోకెన్లు ప్రతిరోజు ఉదయం 11గంటలకు జారీ చేస్తుంటారు. ఈ టికెట్ల కోసం కొందరు ఉదయం 9గంటల నుంచే పడిగాపులు కాస్తున్నారు. టోకెన్లు ఎప్పుడిస్తారో..? ఎక్కడిస్తారో..? తెలియక నిరాశతో వెనుదిరుగుతున్నారు. అన్నదానం టోకెన్లు జారీ సమయం తెలిసేలా ఆలయ ప్రధాన ద్వారం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతోపాటు, ప్రతి మంగళవారం, శనివారాల్లో కనీసం 300మందికి, మిగిలిన రోజుల్లో 200 మందికి ఉచిత అన్నదానం అందేలా ఆలయ అధికారులు చొరవ చూపాలని భక్తులు కోరుతున్నారు.



టోకెన్ల కోసం క్యూ కట్టిన భక్తులు

రాజకీయాలకతీతంగా అభివృద్ధి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్: రాజకీయాలకతీతంగా పనిచేసి అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం రాయికల్ మండలం సింగరావుపేట, కిష్టంపేట గ్రామాల్లో రూ.10 లక్షల ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సింగరావుపేటలో మారంపల్లి మహేశ్, మహంకాళి రాజం, గంగరాజుకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పనిచేసి నియోజకవర్గ అభివృద్ధికి పనిచేస్తానని తెలిపారు. స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ పక్షాన ప్రజలు ఉండాలన్నారు. దశాబ్దాల కాలం తర్వాత నూతన రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. రుణమాఫీ, రైతు భరోసాతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతిగా మారిందన్నారు. కార్యక్రమంలో రాంచందర్‌రావు, జానగోపి, జాన గంగాధర్, రవిగౌడ్, రవిందర్‌రావు, ముఖీద్, భీమయ్య, సిరిపురం సత్తయ్య, ఆదిరెడ్డి, జీవన్‌రెడ్డి, రాజమౌళి పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



కిష్టంపేటలో భూమిపూజ అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి, బావోజీపల్లిలో హనుమాన్ ఆలయానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిటిష్ మొగలుల పాలనలో ఆలయాలు ధ్వంసం చేయబడ్డాయని, మన చరిత్ర మనం కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మన ధర్మాన్ని మన సంస్కృతిని మనం కాపాడుకోవాలని సూచించారు. ముందుగా ఇవే ఆలయానికి జెడ్పీ చైర్‌పర్సన్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు సదాశివరావు, ప్రకాశ్, శంకర్, శేఖర్, శాంతపురావు, రవీందర్‌రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వృద్ధుడి ఆత్మహత్య

గంగాధర: మండలంలోని మధురానగర్‌లో నివాసం ఉంటున్న అల్లకుంట గంగారాం(70) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం .. కొడిమ్యాల మండలం నమిలికొండ గ్రామానికి చెందిన గంగారాం మధురానగర్‌లో తన పెద్ద కొడుకు వద్ద ఉంటున్నాడు. ఐదేళ్ల వ్యవధిలో భార్య, కూతురు, చిన్న కుమారుడు చనిపోయారు. అప్పటినుంచి మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం ఇంటినుంచి వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించినా కనిపించలేదు. శనివారం ఉదయం పెద్దకొడుకు శ్రీనివాస్ ఇంటి షట్టర్ తెరిచి చూడగా వెంటి లేటర్‌కు ఉరి వేసుకొని మృతి చెంది కనిపించాడు. శ్రీనివాస్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..

ముస్తాబాద్(సిరిసిల్ల): ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యం భరించలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మండలం చీకోడుకు చెందిన గూడ బాలేశ్వర్‌రెడ్డి(53) అప్పుల బాధతో ఇబ్బందులు పడుతున్నాడు. కొద్దిరోజులుగా అనారోగ్య సమస్యలు వెంటాడాయి. రెండేళ్ల క్రితం కుమారుడు శ్రీకర్‌రెడ్డి అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటినుంచి మానసికంగా కుంగిపోయాడు. భార్య మమత సిరిసిల్లలో ఆశకార్యకర్తగా పనిచేస్తుండగా, తల్లి వసంత ఊరెళ్లింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలేశ్వర్‌రెడ్డి శనివారం ఉరివేసుకున్నాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

బాలేశ్వర్‌రెడ్డి (ఫైల్)

జ్వరంతో బాలుడి మృతి

- సిరిసిల్లలో పండుగ పూట విషాదం

సిరిసిల్ల క్రైం: రాఖీ పండుగ రోజు ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. జ్వరంతో బాధపడుతున్న చిన్నారి పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు తెలిపిన వివరాలు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన ఆటో కార్మికుడు ఎర్రం బాలయ్య, మంజుల దంపతుల కుమారుడు అశ్విన్ సర్ధాక్(6) మూడు రోజులుగా విషజ్వరంతో బాధపడుతున్నాడు. సర్ధాక్‌ను తల్లిదండ్రులు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స చేసినా జ్వరం తగ్గకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కరీంనగర్ సివిల్ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమించిందని వైద్యులు తెలిపారు. వెంటనే కరీంనగర్‌లోని ప్రైవేట్ మెడికల్ కళాశాల ఆస్పత్రికి తరలించగా శనివారం మధ్యాహ్నం మృతిచెందాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

అశ్విన్ సర్ధాక్(ఫైల్)

సాక్షి సెల్ఫీ బంధన్

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రాఖీ పండుగను శనివారం ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన సెల్ఫీ విత్ రాఖీకి భారీ స్పందన వచ్చింది పలువురు సోదరీమణులు సోదరులకు... బిడ్డలు.. తండ్రికి రాఖీ కట్టి సంబరపడ్డారు. తమ అనుబంధానికి గుర్తుగా సెల్ఫీ దిగి సందడి చేశారు.


ఆశిశ్ నందన్, దక్షశ్రీ, కోతిరాంపూర్, కరీంనగర్


వర్షిత, వైశ్విక్ కరీంనగర్


మాన్విక్ శౌర్య, మనుశ్రీ అలుగునూరు, కరీంనగర్


సోదరీమణులతో బాలే అశోక్, జగిత్యాల


రాఖీ వేడుకల్లో దేవేందర్ కుటుంబ సభ్యులు నారాయణపూర్, ఎల్లారెడ్డిపేట, సిరిసిల్ల


అన్నకు రాఖీ కడుతున్న జి. మేఘన కొండాపూర్, జగిత్యాల


గసికంటి గంగరాజంకు రాఖీ కడుతున్న సోదరి, రుద్రంగి


కస్తూరి రాజన్నకు రాఖీ కడుతున్న సోదరి లక్ష్మి, కోరుట్ల


కట్ట వేణుకు రాఖీ కడుతున్న సోదరి, తుమ్మనపల్లి జగిత్యాల జిల్లా


కటకం సురేందర్ కుటుంబం, సాయిరాంపూర్ కాలనీ , కోరుట్ల


రాఖీ కడుతున్న కుంట మనస్విని, ధ్రుతి, బండలింగంపల్లి, ఎల్లారెడ్డిపేట


లాల మహేశ్‌కు రాఖీ కడుతున్న సోదరి, కస్తే కట్కూర్, తంగళ్లపల్లి


రాఖీ వేడుకల్లో మానస కుటుంబం, బొప్పాపూర్, రాజన్న సిరిసిల్ల


నల్లాల మోహన్‌కు రాఖీ కడుతున్న పద్మ, వెంకట్రావ్‌పల్లి, బోయినపల్లి


సోదరీమణులతో నామని శ్రీధర్, వెల్ది, మానకొండూర్, కరీంనగర్


చెల్లెలు ఓమినిరెడ్డితో నర్సింహరెడ్డి, రాజన్న సిరిసిల్ల


నిషిత్, సాహితి, నారాయణపూర్, ఎల్లారెడ్డిపేట, రాజన్నసిరిసిల్ల


పారునంది శివతేజకు రాఖీ కడుతున్న సోదరి, మన్నెంపల్లి, తిమ్మాపూర్, కరీంనగర్


చిన్నారులతో రాఖీ కట్టించుకుంటున్న పిట్టల శ్రీకాంత్, సిరిసిల్ల


రజిని, రాకేశ్, బ్యాంక్ కాలనీ, కరీంనగర్


రాఖీలతో సమ్మెట శ్రీహర్షిత్, ఇల్లంతకుంట, రాజన్న సిరిసిల్ల


శశి, వేములవాడ


జక్కె సంయుక్త, జమ్మికుంట


రాఖీ కడుతున్న శ్రావ్య, జగిత్యాల


సింగు లక్ష్మీనారాయణ, సింగు శ్రీనిత్య, రాజీవ్‌నగర్ కాలనీ, చింతకుంట, కరీంనగర్


శ్రీయాన్స్, కమ్మర్‌పల్లి


శ్రీరాం కృష్ణ, విన్ను సరోజా, సంగెం, కోరుట్ల


రాఖీ వేడుకల్లో టి. రాంచరణ్ కుటుంబం, కనగర్తి, కోనరావుపేట, రాజన్న సిరిసిల్ల


తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, బొంగాని భారతి, రేణికుంట, తిమ్మాపూర్, కరీంనగర్


ఉడుత శంకర్ యాదవ్, పన్నూర్, రామగిరి, పెద్దపల్లి


రాఖీలు చూపుతున్న విజపల్లి రవీందర్ కుటుంబం, కొత్తపల్లి, జమ్మికుంట, కరీంనగర్


వంతడ్పుల అంజలి, కల్లూరు, కోరుట్ల


విలాసాగరం గంగయ్య, గంగవ్వ, బూర్గుపల్లి, గంగాధర, కరీంనగర్


విలాసాగరం రాంతేజ, శరణ్య, బూర్గుపల్లి, గంగాధర, కరీంనగర్


వెగ్యారపు వెంకట అనీష్, కట్ట శ్రీమయుక్త, జగిత్యాల


నీలి శ్రీవైష్ణవి, శ్రీయ, రాయికల్, జగిత్యాల

భూ సమస్య పరిష్కారం కోసం టవరెక్కిన రైతు

ధర్మారం(ధర్మపురి): ధర్మారం మండలం నల్లలింగయ్యపల్లి గ్రామానికి చెందిన రైతు యాళ్ల ప్రకాశ్‌రెడ్డి శనివారం ఓ కంపెనీ సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. బాధితుడి కథనం ప్రకారం.. ప్రకాశ్‌రెడ్డి, నర్సింహారెడ్డి అన్నదమ్ములు. వీరిద్దరికి గ్రామ శివారులోని సర్వే నంబర్లు 74, 80లో చెరో 2.22 గుంటల భూమి ఉంది. ఈ భూములోంచే ధర్మారం- పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మించారు. రోడ్డు వైపుఉన్న భూమికి డిమాండ్ పెరిగింది. దీంతో ఇద్దరి మధ్య భూ సమస్య తలెత్తింది. ఈక్రమంలోనే సర్వేనంబరు 74లోని భూమిలో నర్సింహారెడ్డి దుక్కిదున్నుతుండగా.. ప్రకాశ్‌రెడ్డి అక్కడకు వెళ్లాడు. తనకు వాటాగా వచ్చిన భూమిలో ఎందుకు దున్నుతున్నావని ప్రశ్నించాడు. నర్సింహారెడ్డి ఆగ్రహంతో ప్రకాశ్‌రెడ్డిపై దాడికి యత్నించాడు. అంతటితో ఆగకుండా చంపుతానని బెదిరించాడు. గత్యంతరం లేక ప్రకాశ్‌రెడ్డి సెల్‌టవర్ ఎక్కాడు. వారసత్వంగా వచ్చిన ఈ భూమి పంపకం విషయంలో ఇద్దరూ సమానంగా పంచుకున్నా.. నర్సింహారెడ్డి తనకు అన్యాయం చేసినట్లు ఆరోపించాడు. ఇదే సమస్యపై గ్రామంలో పలుసార్లు పంచాయితీలూ జరిగాయన్నాడు. అయినా సమస్య పరిష్కారం కాలేదని వాపోయాడు. సమస్య పరిష్కారం కోసమే టవర్ ఎక్కినట్లు వివరించాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపుతామని హామీ ఇవ్వడంతో రైతు టవర్ దిగాడు. కాగా, ఈవ్యవహారం కోర్టు వరకు వెళ్లినట్లు సమాచారం.


టవర్ దిగుతున్న ప్రకాశ్‌రెడ్డి

ఖండాంతరాల్లో రాఖీ వేడుకలు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): తెలుగు వారంటేనే ఆధ్యాత్మికతకు, భారతీయ సంస్కృతికి ప్రతీకలు. ఈ క్రమంలోనే యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా(యూఎస్ఏ)లోని లుసియానా స్టేట్ లఫాయెత్ సిటీలో పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రానికి చెందిన ఇమ్మడి మధుమిత - సాయిరాం దంపతులు,


దుబాయిలో వరలక్ష్మీవ్రతం


యూఎస్ఏలో సోదురుడికి రాఖీ కడుతున్న సోదరి

దుబాయిలోని ఆర్జా అల్ నారాలో గుండా రజని- సతీశ్ దంపతులు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం జరుపుకున్నారు. రక్షాబంధన్, యజ్ఞోపవితరణ(జంజిరం) ధరించారు.

రాఖీ కట్టుకుని.. గుండెపోటుతో మృతి

- నిద్రలోనే ప్రాణాలు విడిచిన యువకుడు

గొల్లపల్లి: రాఖీ పండుగ రోజు.. ఉదయం ఆ ఇంట్లో రక్షాబంధన్ వేడకలు ఆనందంగా జరుపుకున్నారు. సాయంత్రం ఒక్కసారిగా విషాదంలో మునిగిపోయింది. రాఖీ పౌర్ణమి పర్వదినాన తీవ్ర విషాదం నింపిన ఈ ఘటన జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం రాఘవపట్నంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గరిగంటి అనిల్(24) హఠాన్మరణం అందరిని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. కుటుంబ సభ్యులు.. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గరిగంటి తిరుపతి, సత్తవ్వ దంపతులకు ఇద్దరు కొడుకులు, కూతురు సంతానం. చిన్నకుమారుడు అనిల్ హైదరాబాద్‌లో ఎంబీఏ ఫైనలియర్ చదువుతున్నాడు. రాఖీ పండుగ సందర్భంగా మూడు రోజుల కిత్రం స్వగ్రామమైన రాఘవటప్నం వచ్చాడు. స్నేహితులతో ఉత్సాహంగా గడిపాడు. రాఖీ పండుగ సందర్భంగా అక్క అనూష ఇంటి కొచ్చింది. ఇద్దరు సోదరులకు రాఖీ కట్టింది. అనూష ఇంటికి రావడంతో ఆ ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది. అనిల్ మధ్యాహ్న భోజనం చేసి పడుకున్నాడు. సాయంత్రమైన లేవకపోవడంతో కుటుంబసభ్యులు నిద్రలేపారు. ఉలుకుపలుకు లేకపోవడంతో అతడిని వెంటనే జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నిద్రలోనే గుండెపోటు వచ్చినట్లు కుటుంబసభ్యులు భావిస్తున్నారు. పండుగపూట జరిగిన ఈ ఘటన గ్రామస్తులను కలచి వేసింది. కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

అనిల్(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో సీడ్ వ్యాపారి మృతి

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని మంకమ్మతోటలో ఉన్న కొత్తలేబర్ అడ్డా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సీడ్ వ్యాపారి మృతిచెందగా అతని భార్యకు గాయాలయ్యాయి. టూటౌన్ సీఐ సృజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పెగడపల్లి మండలం నామాపూర్‌కు చెందిన చాడ కిషన్‌రెడ్డి(57) సీడ్ వ్యాపారం చేస్తూ.. కరీంనగర్‌లోని విద్యానగర్‌లో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి తన భార్య రమాదేవితో కలిసి బైక్‌పై మంకమ్మతోట నుంచి జ్యోతినగర్ వెళ్తున్న క్రమంలో వేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టడంతో కిషన్‌రెడ్డి కింద పడి స్పృహ కోల్పోయాడు. అతని భార్య తలకు, కాళ్లకు గాయాలు కావడంతో ఇద్దరిని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కిషన్‌రెడ్డి మృతిచెందాడు. మృతుడి సమీప బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కిషన్‌రెడ్డికి ఇద్దరు కుమార్తెలు ఉండగా ఆమెరికాలో ఉంటున్నారు. వారు వచ్చిన తర్వాత అంత్యక్రియలు జరుగుతాయని తెలిసింది.

ఆగిఉన్న వాహనాన్ని ఢీకొని యువకుడు..

ముస్తాబాద్(సిరిసిల్ల): చెల్లితో రాఖీ కట్టించుకున్న యువకుడు ఉత్సాహంగా ఇంటికి చేరే క్రమంలో రోడ్డు పక్కన నిలిపి ఉంచిన వాహనాన్ని ఢీకొట్టి దుర్మరణం చెందాడు. ఏఎస్సై అశోక్‌కుమార్ తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మెయిన్ రోడ్డులో హన్‌మాన్ ఆలయ సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉంచిన బోరుబండిని శనివారం రాత్రి బైక్ ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న పోతుగల్‌కు చెందిన కొప్పు నరేశ్ (26) తీవ్రంగా గాయపడ్డాడు. కడుపులో తీవ్ర గాయాలు కాగా పేగులు బయటపడ్డాయి. చుట్టుపక్కల వారు 108కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్‌లో నరేశ్‌ను సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నరేశ్ మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టినట్లు ఏఎస్సై అశోక్‌కుమార్ తెలిపారు.

నరేశ్ మృతదేహం

కారును ఢీకొట్టిన బస్సు

- నలుగురికి గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి శివారులోని కోళ్లఫాం వద్ద శనివారం ఆర్టీసీ బస్సు, కారును ఢీకొట్టింది. ఈ సంఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం చిన్నపూర్‌కు చెందిన రాజు, మహేశ్, దేవేందర్, మణికంత కారులో కామారెడ్డికి వెళ్తున్నారు. ఎదురుగా ప్రయాణికులతో వస్తున్న సిరిసిల్ల ఆర్టీసీ డిపో బస్సు బైక్‌ను తప్పించబోయి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు గాయపడ్డారు. వీరిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


దెబ్బతిన్న కారు